రైతుబజారు.. స్టాల్స్ అన్నీ తెరవరు

వినియోగదారులకు పూర్తి స్థాయిలో అందని కూరగాయలు

ఉదయం 9 గంటలకే అయిపోతున్న సరకులు

మళ్లీ ప్రైవేట్ మార్కెట్‌పైనే ఆధారం



తెరుచుకోని ప్రావిజనల్ దుకాణాలు



కొన్ని దుకాణాల్లోనే విక్రయాలు, ఖాళీగా ఉన్న 29 నుంచి 31 వరకు స్టాల్స్



ఖాళీగా ఉన్న 1 నుంచి 8 దుకాణాలు

మొత్తం దుకాణాలు	: 31
తెరుచుకున్నవి	: 18
ఖాళీగా ఉన్నవి	: 13
ప్రావిజనల్ స్టోర్స్	: 0

తగరపువలస: మూడు దశాబ్దాలుగా ఎదురు చూసిన చిట్టివలస రైతుబజారు ప్రారంభమైందన్న సంతోషం భీమిలి ప్రాంత ప్రజల్లో పూర్తిగా కనిపించడం లేదు. రైతుబజారు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో దుకాణాలు తెరచుకోవడం లేదు. ధరల పట్టికలో పేర్కొన్న కూరగాయలు, ఆకుకూరలు, పువ్వులు, పండ్లు ఇక్కడ కనిపించడం లేదు. ప్రావిజనల్ షాపులకు వేలం పాటలు పూర్తయినా దుకాణదారులు ముందుకు రావడం లేదు. రైతుల కోసం ఏర్పాటు చేసిన 31 దుకాణాలలో గురువారం 18 మాత్రమే తెరచుకోగా, ఏకంగా 13 దుకాణాలు ఖాళీగా కనిపించాయి.

భీమిలి జోన్‌లో సుమారు 75 వేల మంది, చుట్టుపక్కల మండలాలలో దగ్గరగా మరో 25 వేల మందికి ఇదొక్కటే రైతుబజారు. కానీ, వారి అవసరాలకు సరిపడా దుకాణాలు, కూరగాయలు ఇక్కడ లేవనే చెప్పాలి. వాస్తవానికి ఈ జనాభాకు తగినట్టుగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 47 దుకాణాలు రైతులకు, 10 ప్రావిజనల్ స్టోర్స్, వాష్‌రూమ్‌లు, కార్యాలయం, పార్కింగ్ వంటివి నిర్మించడానికి రూ.78 లక్షలు కేటాయించింది. తరువాత కొండవాలు రక్షణగోడ నిర్మాణానికి కొంత స్థలం పోవడంతో 31 దుకాణాలకు కుదించారు. ఉన్న దుకాణాలలో కూడా ధరలపట్టికలో ఈ రోజు ధరలతో మార్కెటింగ్ శాఖ పేర్కొన్న కూరగాయలు అన్నీ దొరకక వినియోగదారులు మళ్లీ ప్రైవేట్ మార్కెట్‌నే ఆశ్రయించాల్సి వస్తోంది. ఉల్లి, అల్లం, టమాటా, బంగాళాదుంపలు విక్రయించే దుకాణాలు ఒకటో రెండో ఉండటంతో వినియోగదారులు క్యూ కట్టవలసి వస్తోంది. విక్రయదారులకు రైతుబజారులో స్టోర్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తే మిగిలిన కూరగాయలు దాచుకోవడానికి అవకాశం ఉంటుంది. లేదంటే ఏ రోజుకు ఆరోజు రైతులు వచ్చేవరకు వినియోగదారులు ఎదురు చూడవలసి వస్తోంది.



ఒక్కచోటే విక్రయిస్తున్న టమాటాల దుకాణం వద్ద క్యూ లైన్

విశాలమైన, వసతులతో కూడిన రైతుబజారులో షిఫ్టుల పద్ధతిలో అయినా అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలతో అన్ని దుకాణాలను తెరచి పగటిపూట అంతా నడిపించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గతంలో ప్రైవేట్ మార్కెట్ యాజమాన్యం మెయిన్‌రోడ్డుపై ఆర్కే డీలక్స్ నుంచి స్టైలో కట్ పీసెస్ వరకు వ్యాపారాల నిర్వహణకు కోర్టు నుంచి ఇంజంక్షన్ ఆర్డర్ తీసుకువచ్చిందని, ఇప్పుడు ట్రాఫిక్ సమస్యల కారణంగా జీవీఎంసీ ఆ ఆర్డర్‌ను వెకేట్ చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై విక్రయాలు

ట్రాఫిక్ సమస్య యథాతథం

చిట్టివలస రైతుబజారు ప్రారంభంతో ప్రైవేట్ మార్కెట్ వద్ద మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తీరుతుందని భీమిలి పట్టణ ప్రజలు భావించారు. రైతుబజారులో అన్నిరకాల కూరగాయలు దొరకకపోవడంతో పాటు, ఉన్నవి కూడా పాక్షికంగా ఉండటంతో ఉదయం 9 గంటలకే అయిపోతున్నాయి. దీంతో మిగిలిన వినియోగదారులు మళ్లీ ప్రైవేట్ మార్కెట్ బాట పడుతున్నారు. దీంతో మిగిలిన రైతులు వేకువజాము నుంచి చీకటి పడేవరకు ప్రధాన రహదారిపైనే విక్రయాలు జరుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తగరపువలస ప్రాంత ప్రజలను వీడటం లేదు.



మెయిన్‌రోడ్డుపై కూరగాయల విక్రయాలు

కొన్ని రకాలే ఉంటున్నాయి



ధరల పట్టికలో పేర్కొన్న అన్నిరకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పువ్వులు అందుబాటులో ఉండటం లేదు. కొద్ది రకాలే ఉంటున్నాయి, అవి కూడా 9 గంటలకే అయిపోతున్నాయి. ఎంత త్వరగా వచ్చినా కావలసినవి అన్నీ దొరకడం లేదు. ఇలా అయితే ఎలా? అన్ని దుకాణాలు తెరిచేలా మార్కెటింగ్ శాఖ చర్యలు తీసుకోవాలి.

– మాకాల సురేష్‌కుమార్, చిట్టివలస

అన్ని రకాలు అందుబాటులో ఉండాలి



మిగిలిన రైతుబజారుల్లో లాగానే చిట్టివలసలో కూడా పగలంతా రైతుబజారు పనిచేసేలా చూడాలి. అప్పుడు ప్రైవేట్ మార్కెట్‌కు వెళ్లే అవసరం ఎవరికీ ఉండదు. షిఫ్టుల పద్ధతిలో అయినా రైతుబజారులో అన్నీ అందుబాటులో ఉంచాలి.

– కర్రి శంకరరావు, సంగివలస

ట్రాఫిక్ కష్టాలు తొలగించాలి



గతంలో ప్రైవేట్ మార్కెట్ సరిపోక వ్యాపారులు రోడ్డెక్కేవారు. ఇప్పుడు విశాలమైన రైతుబజారు వచ్చిన తరువాత కూడా అవే కష్టాలు. రైతుబజారును వినియోగించుకుని మెయిన్‌రోడ్డుపై వ్యాపారాలు తొలగించాలి. అలా జీవీఎంసీ చర్యలు చేపట్టాలి.

– చేట్ల ఎల్లయ్యరెడ్డి, మాజీ కౌన్సిలర్, సంతపేట

క్లుప్తంగా

జగన్నాథ రథోత్సవాలు ప్రారంభం



అలంకరణలో సుభద్ర, జగన్నాథస్వామి

కొమ్మాది: భీమిలి జగన్నాథస్వామి ఆలయంలో జగన్నాథుని రథోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 6వ తేదీ వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. ముందుగా జగన్నాథస్వామి నేత్రోత్సవం నిర్వహించిన అనంతరం సాయంత్రం శ్రీ సుభద్ర, జగన్నాథ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు ఆర్. సింగరాచార్యులు తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న పద్దరాజు, ఉపాధ్యాయులు

పద్మనాభం: పద్మనాభం మోడల్ ప్రైమరీ పాఠశాలలో 53 మంది విద్యార్థులకు ఇదే పాఠశాలలో పని చేస్తున్న ఎస్.ఉమామహేశ్వరి నోట్ పుస్తకాలు వితరణగా ఇచ్చారు. వీటిని గురువారం పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కె.పద్దరాజు, హెచ్ఎం ఎస్.కళావతి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయలక్ష్మి, రాణి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం

తగరపువలస: ఎస్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం తగరపువలస శాఖలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు ఉద్యోగులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి లలితేష్, ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజినల్ కార్యదర్శి రమేష్‌నాయుడు, చిట్టివలస బ్రాంచ్ కార్యదర్శి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీ గణపతి ఆలయంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న వారాహి దేవి గుప్త నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి అమ్మవారికి మూల మంత్ర అర్చన, అష్టోత్తర శతనామావళి, నీరాజన మంత్ర పుష్పాలు వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నివాసాల మధ్య కోళ్లఫారం తొలగించాలని ఆందోళన

తగరపువలస: ఆనందపురం పంచాయతీ 24 కాలనీ మధ్యలో శ్రీను అనే వ్యక్తి నిర్వహిస్తున్న కోళ్లఫారాన్ని తొలగించాలని గ్రామస్తులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. కోళ్లఫారం వలన ఇంట్లోకి ఈగలు, దుర్వాసన వంట పదార్థాలకు చేరుతోందని తెలిపారు. చనిపోయిన కోళ్లను గ్రామంలోనే పడేయడంతో వీధి కుక్కలు వాటిని తెచ్చి ఇళ్ల ముందు పడేస్తున్నాయన్నారు. ఈ దుర్వాసన వల్ల చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికే మూడు సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కోళ్లఫారాన్ని నివాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు.

దివీస్ ఉద్యోగిని అదృశ్యం



హేమతులసి (ఫైల్)

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలసలో నివాసం ఉంటున్న దివీస్ ఉద్యోగిని కరుతూరి హేమ తులసి(37) గురువారం ఉదయం ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈమె భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో సీనియర్ అధికారిగా, భర్త సురేష్ కుమార్ జూనియర్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి 17, 13 ఏళ్ల వయసు గల ఇద్దరు కుమారులున్నారు. ఇంట్లో నిద్రిస్తున్న సురేష్ కుమార్ వేకువజామున 3.10 గంటలకు మెలకువ వచ్చి చూడగా భార్య హేమతులసి కనిపించలేదు. అరగంట వ్యవధిలో ఆయన సెల్ ఫోన్ స్విచ్ ఆన్ చేయగా భార్య నుంచి ఒక మెసేజ్ వచ్చింది. తాను సమస్యల కారణంగా ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నానని, తనను వెదకవద్దని ఆ మెసేజ్ సారాంశం. భర్త సురేష్‌కుమార్ భీమిలి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు కొమ్మలను తొలగించారు



కుళ్లిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ ప్రధాన రహదారి వద్ద కుళ్లిన చెట్టు కొమ్మలను ఎట్టకేలకు తొలగించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇక్కడ చెట్టు కొమ్మలను నరికిన సిబ్బంది, రోడ్డుపై అలాగే వదిలేశారు. రోజులు గడుస్తున్నా వీటిని తొలగించకపోవడంతో, ఇటీవల కురిసిన వర్షాలకు అవి కుళ్లి దుర్వాసన రావడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గురువారం సాక్షి దిన పత్రికలో 'కొమ్మలను నరికి వదిలేశారు' శీర్షికతో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించి, ఆ కొమ్మలను తొలగింపజేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుధ్య సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించండి

తగరపువలస: పారిశుధ్య సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఆనందపురం పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గురువారం ఆయన డిప్యూటీ ఎంపీడీవో బి.సత్యనారాయణతో కలిసి పంచాయతీలో పర్యటించారు. ముందుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుతుందో చూశారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్‌లో పంచాయతీ నుంచి స్పందన అంతంత మాత్రంగా ఉందన్నారు. 3 నుంచి 4 రోజుల్లో పంచాయతీకి సంబంధించిన గత నాలుగేళ్ల జమా ఖర్చులకు సంబంధించిన నివేదిక ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణను ఆదేశించారు. పొడుగుపాలెం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: బోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శిర్లపాలెం ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నందున ఆ పరిధిలో గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అనంతవరం, పెంట, గంధవరం, కొవ్వాడ, తిమ్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి జీవీఎంసీ తాగునీటి సిబ్బంది సమ్మె



మధురవాడ జోన్‌లో సమ్మెకు సిద్ధం అవుతున్న సిబ్బంది

మధురవాడ/తగరపువలస: జీవీఎంసీ తాగునీటి విభాగం అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కొద్ది నెలలుగా జీతాలు పెంచుతామని చెప్పి, ప్రభుత్వం పెంచకపోవడంతో వారు ఆందోళనకు సిద్ధం అయ్యారు. గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు మధురవాడలో వీరు గురువారం సమావేశం అయ్యారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. దుర్గాప్రసాద్, ఎండాడ సెక్షన్ ప్రెసిడెంట్ చిన్నారావు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న టూల్ డౌన్ చేయగా 15 రోజుల్లో జీతాలు పెంచుతామని అధికారులు రాతపూర్వకంగా హామీ ఇచ్చి కూడా అమలు చేయలేదన్నారు. అధికారుల తీరుతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వస్తోందని చెప్పారు. శుక్రవారం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. తమ పోరాటానికి అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎండాడ సెక్షన్ వైస్ ప్రెసిడెంట్ సతీష్, సెక్రటరీ రవి, జాయింట్ సెక్రటరీ కె. వెంకటేష్, భాస్కర్, రమేష్, శ్రీను, చిన్న తదితరులు పాల్గొన్నారు. జీతాలు పెంచినట్టు ప్రకటించే వరకు సమ్మెలో పాల్గొంటామని కార్మికులు స్పష్టం చేశారు.

కార్మికులకు బకాయి జీతాలు విడుదల చేయాలి

తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డిమాండ్



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

మధురవాడ: జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు బకాయి పడ్డ 2 నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని, తల్లికి వందనం పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ జీవీఎంసీ 5 నుంచి 8వ వార్డు వరకు వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. జీతాలు సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులతో పోల్చి తల్లికి వందనం వంటి ప్రభుత్వ పథకాలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 30న చేపట్టనున్న జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బి. నర్సింగరావు, టి.జాన్, బాలకృష్ణ, కె.అచ్చియ్యమ్మ, ఎం.రమణ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల చేరికతో తగ్గుతున్న చేపల దిగుబడి

చెరువు ప్రక్షాళనకు సహకార సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి



చెరువును శుభ్రం చేస్తున్న సహకార సంఘం ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస పెద్ద చెరువులో సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి వ్యర్థాల చేరికతో కాలుష్యం పెరిగి చేపల దిగుబడి తగ్గిపోయిందని జిల్లా మత్స్యకార సహకారం సంఘం మాజీ వైస్ చైర్మన్ సింగిడి గణేష్ అన్నారు. తాటితూరు స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎ-59 పరిధిలో వంద కుటుంబాలకు చెందిన సభ్యులతో గురువారం చేపట్టిన చెరువును శుభ్రం చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తామంతా 40 ఏళ్లుగా ప్రభుత్వాల సహకారంతో మత్స్యశాఖ సూచనలతో చెరువు భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకుంటూ దీనిపై జీవనోపాధి పొందుతున్నామన్నారు. చెరువు సుందరీకరణ పేరుతో చేసిన అసంపూర్తి కార్యక్రమాల వలన చెరువు విస్తీర్ణం తగ్గడంతో పాటు లోపలికి, బయటకు నీరు వచ్చిపోయే మార్గాలు (ముఖ్యంగా తూర్పు వైపు మదుములు) మూసుకుపోయాయన్నారు. చెరువును ఆనుకుని ఏర్పాటు చేసిన తాత్కాలిక కాలువ వలన అనేక ప్రాంతాల నుంచి మురుగు, వ్యర్థాలు, ఆస్పత్రి నుంచి ప్రమాద కారకాలు చెరువులో చేరి పూడికగా ఏర్పడ్డాయని తెలిపారు. దీంతో మత్స్య సంపద పెరగడానికి విఘాతం ఏర్పడిందన్నారు. దీనికోసం తాము తరచూ శ్రమించి భారీగా ఖర్చులు చేసినా అది తాత్కాలిక ఉపశమనంగానే మిగిలిపోతోందన్నారు. భవిష్యత్తులో ఈ చెరువులో మత్స్యసంపద క్షీణించి ఉపాధి అవకాశాలపై దెబ్బపడే ప్రమాదం ఉందన్నారు. మత్స్యకార సహకార సంఘాలు, సంప్రదాయ మత్స్యకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు చెరువు ప్రక్షాళన పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు సిద్ధాంతపు రవి, ఆబోతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వల్ల భవిష్యత్ నాశనం



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న జడ్జి సౌజన్య, న్యాయవాదులు

కొమ్మాది: మాదకద్రవ్యాల వల్ల భవిష్యత్ నాశనం అవుతుందని మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ అన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా రుషికొండలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ బారిన పడటం వలన కలిగే శారీరక రుగ్మతలు, ఆర్థిక, సామాజిక నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎండాడలోని జిల్లా పరిషత్ హైస్కూల్లోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే అనర్థాలు, ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు తెలియజేశారు.

భీమిలిలో ర్యాలీ

జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమిలిలోని జాతీయ న్యాయ సేవాసంస్థ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి భవాని, న్యాయవాదులు మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్.జనార్ధనరావు, కార్యదర్శి మంజుల, న్యాయవాదులు ఎంపీ పార్వతీశం, సుందర్‌సింగ్, వెంకటేష్, భరద్వాజ్, పాత్రుడు పాల్గొన్నారు.

- ప్రభుత్వ డిగ్రీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు, కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

తగరపువలస: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందామని సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు స్వామి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం అంతమైనట్టేనన్నారు. మరో ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఏమి ఇచ్చినా తీసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. వ్యసనాలకు బానిసలు కావద్దని కోరారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, జగదీష్, ప్రమీల, శ్రీదేవి, విశ్వేశ్వరరావు, ప్రతాప్, రాజ్యలక్ష్మి, రాంబాబు, సత్యలక్ష్మి, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు



గొర్రెకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు సంవర్ధక శాఖ జేడీ కరుణాకరరావు

ఆరిలోవ: ఈ ఏడాది జూలై 10 వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకరరావు తెలిపారు. వర్షా కాలం కావడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా గురువారం నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల గొర్రెలకు టీకాలు వేసినట్లు జేడీ చెప్పారు. గొర్రెలు, మేకలు పచ్చిక మేసే సమయంలో పొట్టలో పురుగులు చేరుతాయని, వాటి వల్ల రక్తహీనత కలిగి నీరసిస్తాయని చెప్పారు. అలాంటి వ్యాధుల నుంచి రక్షణకు నట్టల నివారణ మందు వేస్తున్నామన్నారు. జిల్లాలో 42,000 గొర్రెలు, 26,000 మేకలున్నాయని వెల్లడించారు. వాటన్నింటికి సరిపడేలా మందులు సిద్ధం చేశామని, అన్ని పశువుల ఆస్పత్రుల్లో వీటిని అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజశేఖర్, ఏడీ డాక్టర్ ప్రసాదరావు, వెటర్నరీ వైద్యురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు

పద్మనాభం: కృష్ణాపురంలో 256 గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణకు మందులు పట్టారు. పద్మనాభం పశు వైద్యాధికారి కె.మహేష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సిటు నాయకులు

తగరపువలస: నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే డిమాండ్‌తో జూలై 9న తలపెట్టిన అఖిల భారత జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిటు నాయకులు కోరారు. జాతీయరహదారి వద్ద సమ్మె పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిటు నాయకుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం విక్రయాన్ని ఆపాలని, తొలగించిన కార్మికులకు బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయడంతో పాటు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, నీలాతి రాము, పల్లా పెంటరాజు, పల్లా రమణ తదితరులు పాల్గొన్నారు.